

ఇందిరాపార్కు వద్ద ధర్నాలో అసోసియేషన్ సభ్యులు

ఇందిరాపార్కు వద్ద నిరుద్యోగుల ధర్నా

కవాడిగూడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గురుకుల ఉపాధ్యాయ నియామకాల్లో అవరోహణ క్రమం పాటించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అన్ ఎంప్లాయీస్ అండ్ ప్రైవేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ నీల వెంకటేష్, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాదగోని సైదులుగౌడ్, కార్యదర్శి పి.రమేష్, బాలరాజు, నాయకులు అశోక్ మాట్లాడారు. గురుకులాల్లో ఏకకాలంలో భర్తీ చేస్తున్న ఉపాధ్యాయ నియామకాల్లో అవరోహణ క్రమం (పెద్ద ఉద్యోగుల తర్వాత చిన్న ఉద్యోగుల భర్తీ) పాటించకుండా రెండు, మూడు ఉద్యోగాలకు సెలెక్ట్ అయిన అభ్యర్థుల నుంచి రీల్ ఇన్వెస్ట్‌మెంట్ తీసుకోకుండా నియామకాలు చేపట్టడం వల్ల కొన్ని ఉద్యోగాలు బ్యాక్ లాగ్‌లుగా మిగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాకు మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ హాజరై మద్దతు తెలిపారు. ఈ ధర్నాలో అస్మా, దనలక్ష్మి, ఉపేందర్, రాజు, రాజేందర్‌తో పాటు దాదాపు వంద మంది నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల విజయవంతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న చిరంజీవి

రాంనగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మార్చి 18 నుంచి జరిగే టెన్త్ పరీక్షలు విజయవంతంగా జరిగేలా చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, కస్టోడియల్ అధికారులు కృషి చేయాలని ఉప విద్యాధికారి చిరంజీవి సూచించారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ అంబేడ్కర్ కళాశాల ఆడిటోరియంలో హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి ఆధ్వర్యంలో టెన్త్ పరీక్షల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ మండలం ఉప విద్యాధికారి చిరంజీవి మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విద్యాశాఖ ఇచ్చిన గైడ్‌లైన్స్ పాటించాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అదనపు సమయం కేటాయించారని పేర్కొన్నారు. అసిస్టెంట్ కమిషనర్ జూపల్లి నర్సింగ్‌రావు మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రిషికాంత్, కిరణ్‌కుమార్, విఠలాచారి పాల్గొన్నారు.

'థియేటర్ సిబ్బందిపై దాడిచేసిన వారిని శిక్షించాలి'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్ సుదర్శన్ సినిమా థియేటర్‌లో గాయపడిన కార్మికులను సినిమా థియేటర్‌ల సిబ్బంది కార్మిక యూనియన్ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ సినిమా థియేటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు మారన్న మాట్లాడుతూ.. కొందరు ఆకతాయిలు వర్షం సినిమా ప్రదర్శన సందర్భంగా థియేటర్ సిబ్బందిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడి చేసిన వారిని చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని కార్మికులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు మారన్న, కార్యదర్శి అరుణ్, ఉపాధ్యక్షుడు పుల్లారావు, కమలాకర్, రామస్వామి, సుధాకర్ తదితరులున్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గజ్జెల కాంతం, పిడమర్తి రవి తదితరులు

బీజేపీని అంతం చేయడానికే మాదిగ జోడోయాత్ర

కవాడిగూడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని, 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21 నుంచి మాదిగల జోడోయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ ఛైర్మన్ గజ్జెల కాంతం తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో జోడోయాత్ర అమీర్‌పేటలో ప్రారంభమై ఈనెల 29న వరంగల్‌లో ముగుస్తుందని ఆయన తెలిపారు. మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జోడోయాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోడోయాత్రలో మాదిగలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ మాదిగల పంతం బీజేపీ అంతం అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఆయన చెప్పారు. జీ యాదన్న, ఎం.నర్సింగ్‌రావు, బి.బాబురావు, చంద్రశేఖర్, మల్లేష్, దేవరకొండ నరేష్, డాక్టర్ సంజీవ్ నాయక్, శైలేందర్‌సింగ్, మహేష్, గణేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాల్‌నగర్ నాలా ప్రహరీని నిర్మించాలి

రాంనగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని దీన్‌దయాల్‌నగర్ బస్తీ పక్కన కూలిన నాలా ప్రహరీని త్వరితగతిన నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ డీఈ సన్నీ, ఇతర సిబ్బంది బస్తీవాసులతో కలిసి కూలిన ప్రహరీని పరిశీలించారు. ప్రహరీ లేకపోవడం వల్ల ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని, ప్రహరీ పనులను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. దీన్‌దయాల్‌నగర్‌లో నెలకొన్న డ్రైనేజీ మంచినీటి ఇతర సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఠా జైసింహ, కె.సురేందర్, రవియాదవ్, సయ్యద్ అస్లాం, ఖదిర్, మహ్మద్ జహంగీర్, గురుదీప్ సింగ్, గోపి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పి.సాయిబాబా, నల్లెల కిషోర్

నగర సమస్యలపై చర్చించని జీహెచ్‌ఎంసీ కౌన్సిల్

రాంనగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి సరైన నిధులు కేటాయించడంలో రెండురోజుల పాటు జరిగిన జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశాలు పూర్తిగా విఫలమయ్యాయని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సాయిబాబా, నల్లెల కిషోర్‌లు ఆరోపించారు. మంగళవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నగరంలో పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాలు, వీధికుక్కలు, కోతుల బెడద ఇతర సమస్యలు రాజ్యమేలుతుంటే వాటిపై చర్చించి పరిష్కారం చేయకుండా ఏవిధంగా ఆదాయ వనరులు సమకూర్చువాలనే అంశాలపై దృష్టి పెట్టడం బాధాకరమన్నారు. టీడీపీ నేతలు బాల్‌రాజ్‌గౌడ్, ఎస్ ప్రకాష్, జి యాదగిరి రావు, నాగునాగేష్ పాల్గొన్నారు.

ఘనంగా భీష్మపితామహ జయంతి


ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గంగపుత్రుల ఆరాధ్యదైవం భీష్మపితామహ జయంతిని ముషీరాబాద్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ చేపల మార్కెట్ నుంచి భీష్మపితామహ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఈ ర్యాలీకి ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు హాజరై భీష్మవిగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. గంగపుత్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అమృత్‌రాజ్, శంకర్, శ్రీరాములు, గంగపుత్ర సంఘం నగర ఉపాధ్యక్షుడు మీసాల ప్రసాద్, చేపల మార్కెట్ హోల్‌సేల్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు గణేష్, ఆలిండియా గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు పూస గోరక్‌నాథ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

● అంబర్‌పేటలో నిర్వహించిన భీష్మపితామహ జయంతిలో ముషీరాబాద్‌కు చెందిన ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జిశత్రు పాల్గొన్నారు. చిలుకూరి ఆలయ ప్రధాన పూజారి సౌందరరాజన్‌ను సన్మానించారు.

ఎల్‌అండ్‌టీపై చర్యలు తీసుకోవాలి

● కాగ్ నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి ● సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్


మాట్లాడుతున్న ఎం.శ్రీనివాస్ తదితరులు

రాంనగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఒప్పందాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ మెట్రో ప్రయాణికులను దోచుకుంటున్న ఎల్ అండ్ టీ అక్రమాలపై చర్యలు చేపట్టాలని సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లోని సీపీఎం నగర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందానికి భిన్నంగా ఎల్ అండ్ టీ సంస్థ మెట్రో చార్జీలు అధికంగా వసూలు చేస్తోందని ఆరోపించారు. కాగ్ నివేదిక ప్రకారం 2020 నాటికి రూ.213 కోట్లను అదనంగా వసూలు చేసిందని, ఇప్పటి వరకు లెక్క వేస్తే అది సుమారు రూ.500 కోట్లకు చేరుతుందన్నారు. మెట్రో స్టేషన్ల విస్తీర్ణం తగ్గించి నిర్మించడంతో ఎల్‌అండ్‌టీకి రూ.227 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఉప్పల్ కాస్టింగ్ యార్డు తక్కువ ధరకే లీజుకు ఇవ్వడం ద్వారా 2020 నాటికి రూ.95 కోట్ల నష్టం జరిగిందని కాగ్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. పట్టణ పునరుద్ధరణ పనుల పేరుతో ఎల్‌అండ్‌టీ చేయాల్సిన పనులను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) చేపట్టి రూ.112 కోట్ల భారాన్ని తనపై వేసుకుందన్నారు. నగరంలో మెట్రో రైల్‌ను ప్రారంభించకముందే ఎల్‌అండ్‌టీ సంస్థ ఒప్పందానికి విరుద్ధంగా ప్రాజెక్టు ఆస్తిని సబ్‌లీజుకు ఇచ్చి రూ.19 కోట్ల ఆదాయాన్ని పొందిందన్నారు. కేంద్ర చట్టం ప్రకారం నిర్మాణ ప్రాజెక్టు ఖర్చులో 1 శాతం లేబర్ సెస్ చెల్లించాల్సి ఉన్నప్పటికీ.. ఎల్‌అండ్‌టీ ఇప్పటి వరకు రూపాయి కూడా చెల్లించలేదన్నారు. చాలా మెట్రో స్టేషన్లలో పార్కింగ్ సదుపాయం కల్పించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హైటెక్‌సిటీలో పార్కింగ్ కోసం కేటాయించిన 15 ఎకరాలను అమ్ముకుంటుందన్నారు. గత ప్రభుత్వం తన తప్పిదాల కారణంగానే ఎల్‌అండ్‌టీ దోపిడీకి అడ్డుకట్ట వేయలేకపోయిందని, సీపీఎం ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు చేసినా పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయి విచారణ జరిపించి ఎల్‌అండ్‌టీపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాగ్ నివేదిక ఆధారంగా దోచుకున్న ప్రభుత్వ సొమ్మును ఎల్‌అండ్‌టీ నుంచి తిరిగి రాబట్టాలని కోరారు.

వివక్ష లేని సమాజం కోసం సమాయత్తం కావాలి



మాట్లాడున్న వడ్లమూరి కృష్ణస్వరూప్ తదితరులు

కవాడిగూడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వివక్షత లేని సమాజం కోసం యువత సమాయత్తం కావాలని ఇంటర్నేషనల్ సోషల్ జస్టిస్ ఫోరం ఛైర్మన్, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. మంగళవారం ప్రపంచ సామాజిక న్యాయదినోత్సవం సందర్భంగా దళిత బహుజనపార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, జాతి, తెగ, భాష తదితర వివక్షలు లేకుండా సమాజం సమానత్వ బావంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలోని మనువాద పాలకులు సోషల్ జస్టిస్‌కు వ్యతిరేకంగా పాలన చేస్తున్నారని, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కాన్ఫడరేషన్ ఛైర్మన్ డాక్టర్ వీఎల్ రాజు, దళిత బహుజన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బీరం సతీష్‌కుమార్, రాష్ట్ర కో ఆర్డినేటర్ గణేష్, మాలమహానాడు అధ్యక్షుడు జేఎన్ రావు, ఎస్సీ ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రాజలింగం పాల్గొన్నారు.

గాంధీనగర్ ఏసీపీగా మొగులయ్య


మొగులయ్య

కవాడిగూడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీగా వై.మొగులయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏసీపీగా పనిచేసిన రవికుమార్ సీఐడీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని చౌటుప్పల్ స్టేషన్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న వై.మొగులయ్య గాంధీనగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ మొగులయ్య మాట్లాడుతూ.. గాంధీనగర్, దోమలగూడ, లేక్ వ్యూ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల అదుపునకు పటిష్టమైన చర్యలు తీసుకుంటానన్నారు.

● సీఐ బాధ్యతల స్వీకరణ


రాజు

గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ సీఐగా డి.రాజు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన సునావత్ రవి ముషీరాబాద్ పీఎస్‌కు బదిలీ అయ్యాయరు. గద్వాల జిల్లా అలంపూర్ సర్కిల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న డి రాజు గాంధీనగర్ సీఐగా బదిలీపై వచ్చారు.

● థియేటర్‌లో ఆర్ఎస్ ప్రవీణ్



బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బయోగ్రఫీ ఆధారంగా తీసిన ప్రవీణ్ ఐపీఎస్ (ఇక ప్రజాసేవలో) సినిమాను మంగళవారం సాయంత్రం ఫస్ట్‌షోను ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని దేవి థియేటర్‌లో ఆ సినిమా నటీనటులు, ప్రేక్షకులు, బీఎస్పీ కార్యకర్తలతో కలిసి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వీక్షించారు. సినిమాను చూసినవారిలో రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి అప్పికట్ల భరత్ భూషణ్, సినిమా నిర్మాత నీల మామిడాల ఉన్నారు.

- చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

అనిల్‌ను అభినందించిన కాంగ్రెస్ నేతలు


అనిల్‌ను అభినందిస్తున్న నర్సింగ్‌రావు తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ రాజ్యసభ సభ్యుడినిగా ఎంపికైన సందర్భంగా మంగళవారం ఆయనను ఆ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. పార్టీ సీనియర్ నాయకుడు మారిశెట్టి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో యాదగిరి గౌడ్, సత్యనారాయణ, జానకి సుధాకర్, సురేందర్, జగదీష్, నవీన్, అభిషేక్, సలీం, బ్రహ్మం, భాస్కర్, సాయిరామ్, మదుకర్, దినేష్, బాబ్జీలు అనిల్‌ను అభినందించారు.

హామీలను అమలు చేయాలి: వంగపల్లి


మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు మాదిగలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నిర్వహించిన మాదిగ మహిళా సమాఖ్య రాష్ట్ర స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డప్పుకొట్టే వారికి, చెప్పులు కుట్టే కులవృత్తుల వారికి నెలకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జనాభాకు అనుగుణంగా మాదిగలకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాతాకుల భాస్కర్, యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పి రమేష్, కోర్‌కమిటీ సభ్యులు గణేశ్, వేణుగోపాల్, కృష్ణ, మేరి మాదిగ, అండాలు, శ్రీనివాస్ కొల్లూరి వెంకట్, వరలక్ష్మి, మహేశ్వరి, లావణ్య, రూప, పూర్ణిమ, మల్లీశ్వరి సుజాత తదితరులు పాల్గొన్నారు.

● సీఐకి సత్కారం



ముషీరాబాద్ సీఐగా బాధ్యతలు చేపట్టిన రవిని బీజేపీ రాష్ట్ర నాయకులు నైషదం సత్యనారాయణమూర్తి, రాంనగర్ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కె.అరుణ్ తదితరులు సత్కరించారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి



వీరసావర్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టడంలో జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న స్థానిక బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. విగ్రమం చుట్టూ ప్రహమరీ, మెట్లు ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని, మెట్లు ప్రహరీ నిర్మించాలని పలువురు కోరుతున్నారు. - బర్కత్‌పుర

1,600 గ్రూప్-1 పోస్టులు భర్తీ చేయాలి

ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రూప్-1 ద్వారా 1,600 పోస్టులు భర్తీ చేయాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గ్రూప్-1 ద్వారా 563 పోస్టుల భర్తీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని, కానీ 1,600 పైగా పోస్టులు వస్తాయని అన్నారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఆర్.కృష్ణయ్య విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా జిల్లాలు ఏర్పడిన కారణంగా భారీ సంఖ్యలో గ్రూప్ 1, 2, 4 ఖాళీలు ఏర్పడతాయని, కొత్త జిల్లాలకు, మండలాలకు, మునిసిపాలిటీకు పోస్టులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వాటిలో గ్రూప్-1 పోస్టులు 50 శాతం, గ్రూప్-2 పోస్టులు 30-40 శాతం డైరక్ట్ రిక్రూట్‌మెంట్ కింద భర్తీ చేయాలన్నారు. ఒకే దఫా గ్రూప్ 1, 2, 3, 4 పోస్టులతో పాటు టీచర్, లెక్చరర్, ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ చేస్తున్నందున మెరిట్ అభ్యర్థులు ఈ పోస్టులన్నింటికీ ఎంపికవుతారని, ఒకే పోస్టును ఎంచుకోవడం వల్ల మిగతా పోస్టులు బ్యాక్‌లాగ్ కింద పడిపోతాయని తెలిపారు. కాబట్టి ఒకేసారి ఫలితాలు ప్రకటించడం, ఆప్షన్ పద్ధతి, వెయిటింగ్ లిస్టు కాల పరిమితి ప్రవేశ పెట్టడం వంటి చర్యలు తీసుకుంటే పోస్టులు మిగిలిపోకుండా భర్తీ అవుతాయని ప్రభుత్వానికి కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు.

రూ.70 వేలు ఇవ్వు.. లేదంటే అత్యాచారం కేసు పెడతా..

హాస్టల్ ఖాళీ చేయమన్నందుకు బెదిరించిన మహిళ


నయిమాసుల్తానా

బర్కత్‌పుర, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ ఖాళీ చేయమన్నారని యజమానిని బెదిరించింది ఓ యువతి. కాచిగూడ సీఐ ఎం.రామలక్ష్మణ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన సయ్యద్ అహ్మదుద్దీన్ కుమార్తె సాదియా నయిమా సుల్తానా(30) ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ వర్క్‌ఫ్రం హోం చేస్తున్నట్లు హాస్టల్ యజమానిని నమ్మించి బర్కత్‌పురాలోని అన్నపూర్ణ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో పదిహేను రోజుల క్రితం చేరింది. ప్రతిరోజూ రాత్రి 11 గంటలకు బయటకు వెళ్లి తెల్లవారుజామున తిరిగి వచ్చేది. ఆమె ప్రవర్తనపై అనుమానం వచ్చిన హాస్టల్ యజమాని శ్యాంబాబు ఆధార్ కార్డు ఇవ్వాలని, లేకపోతే హాస్టల్ ఖాళీ చేసి వెళ్లిపోవాలని చెప్పాడు. దీంతో ఆ యువతి తనకు రూ.70 వేలు ఇవ్వాలని, లేకపోతే రేప్ కేసు పెడతానని యజమానిని బెదిరించింది. నగర పోలీసు కమిషనర్ కార్యాలయానికి వెళ్లి హాస్టల్ యజమాని వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. దీంతో శ్యాంబాబు మంగళవారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారించగా.. యువతిపై 18 కేసులు ఉన్నట్లు తెలిసింది. లిఫ్ట్ అడిగి డబ్బు డిమాండ్ చేయడం, ఇవ్వకపోతే దుస్తులు చించుకొని అఘాయిత్యానికి పాల్పడ్డారని తప్పుడు ఫిర్యాదు చేస్తున్నట్లు తేలింది. గతేడాది డిసెంబర్‌లో జూబ్లీహిల్స్ పరిధిలో కారు యజమానిని లిఫ్ట్‌అడిగిన నయిమా సుల్తానా రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. డబ్బు ఇవ్వకపోవడంతో రేప్ చేశాడని బెదిరించి దుస్తులు చించుకుంది. కారు యజమాని ఆమెను తీసుకొని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా.. రిమాండ్‌కు తరలించారని, ఈ ఏడాది జనవరిలో జైలు నుంచి విడుదలయిందని సీఐ తెలిపారు. నగరంలోని పలు పీఎస్‌లలో ఆ యువతిపై 18 కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.


ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో అభివాదం చేస్తున్న తుడుందెబ్బ నేతలు

కొమురంభీం కాలనీవాసులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా మావల మండలం భట్టి సావర్గామ్ శివారులోని సర్వేనెంబర్ 72/22, 72/23లోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని ఉంటున్న 2 వేలా 43 మంది ఆదివాసీలకు జీవో 58 ప్రకారం ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ డిమాండ్ చేసింది, మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఆదివాసీల మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఘైపతి అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గోడెం గణేశ్ మాట్లాడుతూ.. ఆదివాసీలు నివసిస్తున్న ప్రాంతాలకు ఇళ్లపట్టాలు నీళ్లు, కరెంట్, విద్యా వైద్యం రోడ్డురవాణా సౌకర్యాలు కల్పించడంలో పాలకులు వైఫల్యం చెందారని విమర్శించారు. కొమురంభీం కాలనీలో కొంతమంది రాజకీయ నాయకులు, అధికారులు కుమ్మక్కై ఎన్ఓసీలు తీసుకుంటూ తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూములను కబ్జాచేస్తూ ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ కార్యదర్శి కె నాగేష్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు పాపారావు, ఆదివాసీ అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు బాపురావు, నేతలు చలపతి, సోయంజంగ్, రేణుక, పుష్పారాణి, లలితాబాయి, జంగ్‌బాయి తానాజీ, మనోహర్ పాల్గొన్నారు.

● అర్హులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న వీరయ్య

రాంనగర్: సమగ్ర భూసర్వే జరిపి ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్, పోడు భూములను గుర్తించి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు, సాగు భూములు పంపిణీ చేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర భూసదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూ చట్టాల్లోని లొసుగులను సవరించాలని డిమాండ్ చేశారు. 2016లో చేసిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా 30 లక్షల కుటుంబాలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేవని గత ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు.


విజయనిర్మల జయంతి

కీర్తిశేషులు విజయనిర్మల జయంతి సందర్భంగా నానక్‌రాంగూడలోని విజయకృష్ణ హౌస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ హీరో నరేష్, పవిత్రలకు కేక్ తినిపిస్తున్న ఆల్ ఇండియా కృష్ణ, మహేష్ ప్రజాసేన జాతీయ అధ్యక్షుడు ఖాదర్ గోరి, రమణ, పద్మాలయ శర్మ తదితరులు

కారు బుక్ చేసుకుని కిరాయికి ఇస్తున్న ఇద్దరిపై కేసు



పోలీసుల అదుపులో నిందితుడు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జూమ్ కార్ యాప్‌లో తప్పుడు అడ్రస్ అప్‌లోడ్ చేసి వారిని నమ్మించి కారు బుక్ చేసుకుని దానికున్న జీపీఎస్‌ను తొలగించి కారును సొంత అవసరాలకు వాడుకుంటూ అద్దెకు ఇస్తున్న ఇద్దరు నేరస్థులపై చిక్కడపల్లి పీఎస్‌లో కేసు నమోదైంది. వారిలో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని అతడి నుంచి ఒక గూగుల్ మొబైల్‌తో పాటు రెండు కార్లు స్వాధీనం చేసుకుని అతడిని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ ఒవైసీకాలనీకి చెందిన సల్మాన్‌అలీ(23), మహ్మద్ అబ్దుల్ షోయబ్‌లు గూగుల్ కార్ యాప్‌లో తప్పుడు చిరునామాతో గత ఏడాది ఆగస్టులో కారు బుక్ చేసుకున్నారు. సెల్ఫ్ డ్రైవింగ్ చేసుకుంటూ కారుకున్న జీపీఎస్‌ను తొలగించి వారి సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. అదేవిధంగా ఆ కారును ఇతరులకు అద్దెకు ఇస్తున్నాడు. గోల్కొండ చౌరస్తాకు చెందిన కారు ఓనర్ ధరణికుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు సల్మాన్‌అలీని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు అబ్దుల్‌షోయబ్ కోసం గాలిస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



చిక్కడపల్లి: గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. ఈనెల 15న బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్‌కాలేజీ వద్ద వ్యక్తి(60) అపస్మారకస్థితిలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడికి వచ్చి చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.